# మాజీ మంత్రి తుమ్మలది గోబెల్స్ ప్రచారం

- నాడు ఎన్టీఆర్‌పై చెప్పులు తుమ్మల విసరలేదా..?
- రాష్ట్ర రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 22: తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వెంట నడిచి, పదవులు అనుభవించి వెన్నుపోటు పొడిచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరి బీఆర్‌ఎస్‌పై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఖమ్మం నగరంలోని ఓ కల్యాణ మండపంలో కార్పొరేటర్ రాపర్తి శరత్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. 1996లో ఎన్టీఆర్ రాజకీయ సంక్షోభంలో ఉన్నారని, నాడు ఎన్టీఆర్‌పై చెప్పులు విసిరిన వారిలో తుమ్మల లేరా అని ప్రశ్నించారు. తర్వాత బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. మంత్రి పదవి ఇచ్చి సుముచిత స్థానం ఇచ్చినా వెన్నుపోటు పొడిచి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరారని ధ్వజమెత్తారు. ఖమ్మం నగరం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందో.. లేదో.. తుమ్మల రియల్టర్స్, బిల్డర్స్‌ను ఆరా తీయాలని హితవు పలికారు. అవినీతి అనే మాటే లేకుండా రూ.3,500 కోట్లతో ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేస్తే, తుమ్మలకు ఆ అభివృద్ధి కనిపించడం లేదన్నారు. మంత్రిగా తన కారెక్టర్‌ను కాపాడుకుంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నానని, రాజకీయపరంగా విమర్శిస్తే తాను సహిస్తానని, కానీ తుమ్మల హీనస్థితికి దిగజారి తనపై వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. తుమ్మలకు దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ప్రజలకు ఏం లబ్ధి చేకూరుస్తారో చెప్పి ఓట్లు అభ్యర్థించాలన్నారు. అంతేగానీ చిల్లర రాజకీయాలకు పాల్పడడం సబబు కాదన్నారు. తుమ్మల పదవులు అనుభవించినప్పుడు ప్రజలకు చేసిన ఒక్క మంచి పనైనా ఉందా.. అని మంత్రి ప్రశ్నించారు. తుమ్మల ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు ఖమ్మం ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొన్నారని, సమస్య పరిష్కారానికి తుమ్మల ఏ మార్గం చూపించారో ప్రజలకు తెలియజేయాలన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక, తాను మంత్రి అయ్యాకే చొరవ తీసుకుని మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధజలం అందిస్తున్నామన్నారు. తుమ్మల మంత్రిగా ఉన్నప్పుడు ఖమ్మాన్ని చిన్నచూపు చూశారన్నారు. నాడు నగరంలో 25 వేల నల్లా కనెక్షన్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 75 వేలకు పెరిగిందన్నారు. నాడు నగరం అన్నిరంగాల్లో వెనుకబడి ఉండేదన్నారు. ఇప్పుడు నగరంలో ప్రతి డివిజన్‌లో పార్క్‌లు, మరుగుదొడ్లు, ఓపెన్ జిమ్‌లు, క్రీడాప్రాంగణాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అవసరమైన ప్రతిచోటా రోడ్లు, మురుగు కాలువలు నిర్మించామన్నారు. తాను రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సీఎం కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు మేకల భిక్షమయ్య, పగడాల నాగరాజు, జక్కుల లక్ష్మయ్య, నార్నే ప్రసాద్, పాల నాగేశ్వరరావు, చింతల మల్లికార్జున్, సూరపనేని బాబూరావు, లింగబోయిన సతీశ్ ఉన్నారు.

## తుమ్మల పదవిలో ఉన్నప్పుడు ఎన్నో రాజకీయ హత్యలు.. ఎన్నో ఆత్మఘోషలు

- బీఆర్టీయూ (టూటూ) ఆటో యూనియన్ సమావేశంలో మంత్రి అజయ్‌కుమార్


మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 22: ''మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాడు మంత్రిగా ఉన్నప్పుడు పాల్పడిన రాజకీయ హత్యలు అన్నీ ఇన్నీ కావు. ఖమ్మంలో రౌడీయిజానికి తెరలేపారు. ఎంతో మంది రౌడీషీటర్లను కాపాడారు. ఎన్టీఆర్ వంటి మంచి నేతకు చంద్రబాబుతో కలిసి తుమ్మల వెన్నుపోటు పొడిచారు. ఈ విషయంలో ఇప్పటికీ ఎన్టీఆర్ ఆత్మ ఘోషిస్తుంది. చంద్రబాబుతో అంటకాగి ఎంతోమంది రాజకీయ నాయకుల రాజకీయ జీవితాలను సమాధి చేశారు. తర్వాత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పంచన చేరారు. పదవులు అనుభవించారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తుమ్మలా ఇదా.. మీ నిజాయతీ..? ఇదా మీ నిబద్ధత..?' రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్టీయూ (టూటూ) రాష్ట్ర కార్యదర్శి పాల్వంచ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మల కేవలం రాజకీయ అవసరాల కోసమే పార్టీలు మారుతున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్టీయూ (టూటూ) రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, జిల్లా అధ్యక్షుడు పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరి ఉమామహేశ్, దుర్గాప్రసాద్ గుప్తా, జానీ, మైసా ఆంజనేయులు, సలీం, లక్ష్మీనారాయణ, వీరారెడ్డి, గుంటి శ్రీను, కుక్కల రామకృష్ణ, రాంబాబు, పాపయ్య, ముల్లర్, బాలకృష్ణ, సలీం, సాయిబాబా, పాషా పాల్గొన్నారు.

# జయ జయహే జగన్మాత

## నేడే విజయ దశమి పర్వం

- వేడుకలకు ఉమ్మడి జిల్లాప్రజలు సిద్ధం
- ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
- ఖమ్మంలో పారువేటకు సిద్ధమైన 'జమ్మిబండ'


ఖమ్మం : వేడుకలకు జమ్మిబండ ముస్తాబు

ఖమ్మం/కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 22: చెడుపై మంచి సాధించిన విజయమే. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు నిర్వహించే పండుగ దసరా. మన తెలంగాణలో ఇదే అతిపెద్ద పండుగ. కుల మతాలకు అతీతీంగా జరపుకొనే వేడుక ఇది. సోమవారం ఉమ్మడి జిల్లాప్రజలు పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ప్రత్యేక పూజలకు స్తంభాద్రి లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, పారువేటకు జమ్మిబండ ముస్తాబయ్యాయి. నిర్వాహకులు ఆలయంతోపాటు జమ్మిబండను విద్యుద్దీపాలతో అలంకరించారు.

**మహిమాన్వితం..**
**స్తంభాద్రి స్థల పురాణం..**

ఖమ్మంలోని ప్రాచీన క్షేత్రమైన స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఘనమైన చరిత్ర ఉంది. దీని ప్రకారం.. ఖమ్మం పరిసర ప్రాంతంలోని అష్ణగుర్తికి చెందిన భూపతి వెంకమ్మ అనే మహిళకు నర్సింహస్వామి కలలో సాక్షాత్కరించి 'నేను నర్సింహాస్వామిని ఇక్కడి గుట్టపైన కొలువుదీరి ఉన్నాను. నన్ను గుర్తించి నాకు ఆలయాన్ని నిర్మించండి' చెబుతాడు'. వెంకమ్మ స్వప్న వృత్తాంతాన్ని గ్రామస్తులందరికీ ఆమె తెలియజేస్తుంది. తర్వాత గ్రామస్తులంతా కలిసి ఖమ్మంలోని గుట్టపై లక్ష్మీసమేత నర్సింహాస్వామి విగ్రహాన్ని గుర్తిస్తారు. ఈ విషయాన్ని రెడ్డి రాజులకు తెలియజేస్తారు. పాలకులు రంగంలోకి దిగి ఆలయ నిర్మాణానికి పూనుకుంటారు. రమారమి క్రీ.శ 591లో ఆలయ నిర్మాణం పూర్తయింది. లక్ష్మీ సమేతుడై స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఖమ్మం ప్రజల కొంగు బంగారంగా మారాడు. నాటి నుంచి ప్రజల ఇలవేల్పుగా కొనసాగుతున్నాడు.

**జమ్మిబండ వద్ద పారువేట..**

ఖమ్మం ప్రజల తాగునీటి సమస్య తీర్చేందుకు నాటి పాలకుడు లక్కారెడ్డి తవ్వించిన చెరువే నేటి లకారం చెరువు. విజయదశమి పర్వదినాన స్వామివారు లక్ష్మీ సమేతుడై గ్రామాంతరం వెళ్లే ఉత్సవమే జమ్మిబండ పారువేట స్థలం. రెడ్డి రాజుల కాలంలోనే ఉత్సవ మూర్తులను దట్టమైన అటవీ ప్రాంతమైన జమ్మిబండ ప్రాంతంలోని శమీవృక్షం (జమ్మిచెట్టు) వద్దకు ఊరేగింపుగా తీసుకొచే సంప్రదాయం ప్రారంభమైంది. జమ్మిబండ ప్రాంతం ప్రస్తుత జడ్పీ సెంటర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకూ ఉండేది. నాడు లకారం చెరువు ఒడ్డున జమ్మిబండ ప్రాంతం ఉండేది. గుట్టపై వెలసిన స్తంభాద్రి నర్సింహస్వామిని పండుగ రోజున దర్శించుకునేందుకు వీలు కాని భక్తులు స్వామిని దర్శించుకోవడానికి నిర్మించిన ప్రత్యామ్నాయ వేదికే జమ్మిబండ. అప్పట్లోనే పాలకులు చిన్న మండపం నిర్మించారు. దశాబ్దాల నుంచి ఏటా దసరా సందర్భంగా ఈ పారువేట మహోత్సవం జరుగుతూ వస్తున్నది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి స్థానిక ప్రభుత్వాలే దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. ముస్లిం రాజుల పాలనలోనూ అధికారంగా జరిగేవంటే మత సామరస్యం ఎలా పరిఢవిల్లిందో అర్థం చేసుకోవచ్చు. 1952లో పట్టణ ప్రముఖుడు పంతం రాములు జమ్మిబండ వద్ద స్వామివారి కల్యాణ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తర్వాత ఆయన కుమారుడు పంతం కోటిలింగం ఆ బాధ్యతలు తీసుకున్నారు. తన శక్తియుక్తులతోపాటు ఇతర కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో 1993 అక్టోబర్ 24న మండప నిర్మాణం పూర్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మొర్రేడు వాగు, రైటర్ బస్తీ, రామవరం, రుద్రంపూర్, పెద్దమ్మ తల్లి ఆలయం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ఘనంగా దసరా ఉత్సవాలు జరుపుకునేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద దసరా ఉత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

# బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- పార్టీ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు మదన్‌లాల్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మదన్‌లాల్

కొణిజర్ల, అక్టోబర్ 22: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు మదన్‌లాల్ అన్నారు. తుమ్మలపల్లికి చెందిన బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పతల రామారావుతో పాటు పలువురు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మదన్‌లాల్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సుడా డైరెక్టర్ బండారు కృష్ణ, నాయకులు డేరంగుల బ్రహ్మం, దొడ్డపునేని రామారావు, పాముల వెంకటేశ్వర్లు, యర్రా కృష్ణ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో గెలిపించండి.. అభివృద్ధికి బాటలు వేస్తా..

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు


దుకాణదారులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న లింగాల కమల్‌రాజు

మధిర టౌన్, అక్టోబర్ 22: అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వించి గెలిపిస్తే మధిర నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు కోరారు. ఆదివారం ఆయన మధిర పట్టణంలో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దుకాణ సముదాయాల వద్దకు వెళ్లి యజమానులను ఓట్లు అభ్యర్థించారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైనా ప్రజల మధ్యలోనే ఉన్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు నిధులు రాబట్టానన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని గుర్తుచేశారు. ప్రచారంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కనుమూరి వెంకటేశ్వర్లు, నాయకులు భువనగిరి నారాయణ, కపిలవాయి జగన్మోహన్‌రావు, డోకుపర్తి సత్యంబాబు, పల్లపోతుల ప్రసాద్, వార్డుకౌన్సిలర్లు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లో చేరికలు


మండలంలోని ఏనుకుంట తండాలో బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కందాళ

తిరుమలాయపాలెం, అక్టోబర్ 22: మండలానికి చెందిన ఏనుకుంట తండాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 30 కుటుంబాలు ఆదివారం గ్రామంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కందాళ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. అనంతరం బచ్చోడులో మృతుడు దేవకుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, నాయకులు రవి, జక్కుల యాదగిరి ఉన్నారు.